సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా ఆదివారం మేడ్చల్ పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు.

10న ముగ్గుల పోటీలు

పోచారం: అన్నోజిగూడలోని మీరాలం కుంట వద్ద 10వ తేదీన పోచారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు అదే రోజు మధ్యాహ్నం 2 గంటలలోపు పేర్లు నమోదు చేసుకోవాలని, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల్లోపు ముగ్గులు పూర్తి చేయాలని నిర్వాహకులు సూచించారు. అదేవిధంగా ముగ్గులకు కావాల్సిన సామగ్రిని అభ్యర్థులే తెచ్చుకోవాలని, విజేతలకు నగదు బహుమతితో పాటు పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

14న వేంకటేశ్వర స్వామి కల్యాణం

పోచారం: అన్నోజిగూడలోని ఓంకార క్షేత్రం సాయిబాబా గుడి వద్ద 14వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

క్లుప్తంగా

బిట్స్ పిలానీలో ముగిసిన జాతీయ సదస్సు



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తూ..

మేడ్చల్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో నిర్వహించిన నేషనల్ సింపోసిమ్ ఆన్ కన్వర్జెన్స్ ఆఫ్ కెమిస్ట్రీ, మెటీరియల్స్ (సీసీఎం–2023) జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నానో సైన్స్ శాస్త్రవేత్త చంద్రశేఖర్, పలు రాష్ట్రాల విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, పరిశోధన విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో భాగంగా బిట్స్ పిలానీకి చెందిన లీలశ్రీ మొదటి బహుమతి, ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన ఇషిలా నస్కర్ రెండో బహుమతి, కోల్‌కతా ఐఐఎస్ఈఆర్‌కు చెందిన బిస్వాదీప మూడో బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సౌనక్‌రాయ్, ఎన్.రాజేష్, సాబిట్ సబా, నీలాద్రి దాస్, సతీష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

కురుమ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి



కేలండర్ ఆవిష్కరణలో పాల్గొన్న కురుమ సంఘం ప్రతినిధులు

బోడుప్పల్: కురుమ కులస్తులు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండె శ్రీకాంత్ కురుమ, ఆలేరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య కురుమ అన్నారు. బోడుప్పల్ ఎస్ఎస్ఎస్ గార్డెన్‌లో శనివారం రాష్ట్ర కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో రూపొందించిన 2023 సంవత్సరం కేలెండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఐదుగురు కురుమ కులస్తులను అసెంబ్లీకి పంపే విధంగా కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గొరిగె నర్సింహ్మా కురుమ, శ్రీశైలం బీరప్ప, కోశిక శ్రీనివాస్ కురుమ, గోపాల్, మొంద్ర ఐలయ్య, కుండే వెంకటేశ్ కురుమ, మిరియాల నవీన్ కురుమ, కానుగొంటి వెంకటేశ్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి.. అన్ని విధాలా ప్రభుత్వ సహకారం

- అధికారులు సమన్వయంతో పని చేస్తూ ముందుకు సాగాలి
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మంత్రి చామకూర మల్లారెడ్డి
- జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- హాజరైన కలెక్టర్ హరీష్, వివిధ శాఖల అధికారులు



సభలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి. చిత్రంలో కలెక్టర్ హరీష్, జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి తదితరులు



మాట్లాడుతున్న కలెక్టర్ హరీష్





సభలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర సభ్యులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల్లో హరితహారం, మంచినీటి సరఫరా, ట్రాక్టర్లు, ట్రాలీలు, వాటర్ ట్యాంకర్లను ప్రభుత్వం అందించడం ద్వారా అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తోందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడా లేని విధంగా 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతోందని, ఈ విషయంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా పరిషత్ కార్యాలయం హాలులో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. రైతులకు రైతు బీమా ప్రవేశపెట్టి రూ.5 లక్షలు అందజేస్తూ.. వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రతి ఒక్కరికీ సీఎం కేసీఆర్ ప్రతీ ఏటా ఇచ్చే రూ.5 కోట్ల సీడీఎఫ్ నిధులే కాకుండా అదనంగా మరో రూ.5 కోట్లు విడుదల చేశారని, ఈ నిధులన్నీ గ్రామాలు, పట్టణాల అభివృద్ధికే ఖర్చు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సరిపడా నిధులు: జెడ్పీ చైర్మన్

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సమగ్రాభివృద్ధికి అవసరమైనన్నీ నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో కన్నా శివారు గ్రామాలతో సహా అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం అభివృద్ధి చెంది ఎన్నో మార్పులు జరిగాయన్నారు.

అభివృద్ధిపై సమన్వయంతో పని చేయాలి: కలెక్టర్ హరీష్

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు లేకుండా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హరీష్ అన్నారు. ఇప్పటికే జిల్లా అన్ని రంగాల్లో ముందు స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా ఉందని, ముమ్ముందు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, జెడ్పీ సీఈఓ దేవసహాయం, జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ దర్గ దయాకర్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ తరహా అభివృద్ధి నిరూపిస్తే రాజీనామా చేస్తా: మంత్రి మల్లారెడ్డి

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ తరహా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును నిరూపిస్తే తన పదవులకు రాజీనామా చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సవాల్ విసిరారు. శనివారం జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ.. పైవిధంగా స్పందించారు. ఇదే విషయాన్ని గతంలో కూడా పలుమార్లు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ప్రవేశపెడుతున్నారని మంత్రి తెలిపారు. తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందని, ఇది ఎంతో సంతోషకరమని మంత్రి మల్లారెడ్డి అన్నారు.

సన్మానం..

జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి శనివారం మొదటి సారిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డితో సహా జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)అభిషేక్ ఆగస్త్యలను మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, కలెక్టర్ హరీష్ ఇతర ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

తాగునీటి సరఫరాపై మంట..!

సభలో టీఆర్ఎస్ సభ్యురాలు శైలజా మాట్లాడుతూ.. గ్రామాల్లో మిషన్ భగిరథ మంచినీరు పూర్తి స్థాయిలో సరఫరా చేయకపోవడంతో మహిళలతో సహా గ్రామ ప్రజలు మంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై కాంగ్రెస్ సభ్యుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, పలువురు టీఆర్ఎస్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మల్లన్న సాగర్ రిజర్వాయర్‌ను పూర్తి చేసుకుంటే మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ నిధులపై..

కేంద్రం నుంచి విడుదలైన ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగం, మండల, జిల్లా పరిషత్‌లకు నిధులు కేటాయించకుండా వాటిని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కొద్దిసేపు టీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం జరగా, డీపీఓ, కలెక్టర్ నిధుల వినియోగంపై వివరణ ఇచ్చారు.

బెల్ట్ షాపులు.. గంజాయి విక్రయాలపై..

జిల్లాలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయని సభలో పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ.. ప్రతీ గ్రామంలో 10 నుంచి 20 బెల్ట్ షాపులు నడుస్తున్నాయని, గంజాయి విక్రయాలు సైతం కొనసాగుతున్నాయన్నారు. విద్య, పారిశ్రామిక సంస్థలు అధికంగా ఈ జిల్లాలో బెల్ట్ షాపులు, గంజాయి అమ్మకాలను అరికట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ఎక్సైజ్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్యంపై సీరియస్...

వైద్యారోగ్య శాఖ అధికారులు వైద్య సదుపాయాల విషయాలపై ప్రజానిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని పలువురు సభ్యులు మండిపడ్డారు. డీఎంహెచ్ఓ రాజకీయ నాయకుడిలా ఉపన్యాసాలు ఇవ్వడం సరికాదని, సభ్యులను కించపరిచేలా మాట్లాడటం తగదని, క్షమాపణ చెప్పాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సభ్యులకు బాధ కలిగినందుకు సారీ చెబుతూనే .. మన్నించాలని పేర్కొనడంతో సభ్యులు శాంతించారు. సభలో జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశం,జెడ్పీటీసీ సభ్యులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, శైలజా, ఎల్లుబాయి, ఎంపీపీలు రజిత, అనిత,హారిక, ఇందిర,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క భాస్కర్‌యాదవ్, సభ్యుడు మధుకర్‌రెడ్డి ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి మల్లారెడ్డి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు అండగా ఉంటుందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరిగే టీయూడబ్ల్యూజే, ఐజేయూ మహా సభల వాల్‌పోస్టర్‌ను శనివారం మంత్రి మల్లారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేడ్చల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ ఏకే మురుగేష్, జర్నలిస్టు నాయకులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్, సత్యనారాయణ, యాదగిరి, కిరణ్, నవీన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు పటాన్‌చెరులో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు, ఆల్ ఇండియా ప్లీనరీ పోస్టర్‌ను జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, కలెక్టర్ హరీష్‌తో కలిసి మంత్రి చామకూర మల్లారెడ్డి ఆవిష్కరించారు. శనివారం జెడ్పీ సమావేశం మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివాజీ, రంగు వెంకటేష్‌గౌడ్, మాజీ ప్రధానకార్యదర్శి ఉదండపురం వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సుగ్రీవుడు, కుత్బుల్లాపూర్ జాయింట్ సెక్రెటరీ కుర్రముల రాజు, జిల్లా నాయకులు కోల వెంకటేశ్వర్లు, రవిచంద్ర, రామారావు, రవికిరణ్, అమర్ పాల్గొన్నారు.


భూ సమస్య పరిష్కరిస్తాం: మంత్రి మల్లారెడ్డి



అంకుషాపూర్ రైతులతో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని సర్వే నంబర్లు 171, 172, 173, 210, 211,193లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించాలని ఆ గ్రామానికి చెందిన దళితులు మంత్రి మల్లారెడ్డిని ఆయన నివాసంలో శనివారం కలిశారు. బాధితుల గోడు విన్న మంత్రి భూ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న మల్లారెడ్డి

కీసర: గోధుమకుంట గ్రామ పంచాయతీ టీపీఎస్ కృష్ణానగర్ కాలనీకి చెందిన కె.మహేశ్వరికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.18 వేలకు సంబంధించిన చెక్కును శనివారం మంత్రి చామకూర మల్లారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సోమని ఆంజనేయులు, వార్డు సభ్యులు, మేడ్చల్ జిల్లా కుర్మసంఘం అధ్యక్షుడు చీర సురేష్, కాలనీ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన పలువురికి మంత్రి మల్లారెడ్డి శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. మర్పల్లిగూడకు చెందిన లబ్ధిదారులు సుశీలకు రూ.29 వేలు, మున్సిపాలిటీకి చెందిన సంజీవరెడ్డికి రూ.60 వేలు, పట్టణానికి చెందిన సావేరా బేగంకు రూ.15 వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రసిడెంట్ సుధాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

12 మంది బడీడు పిల్లల గుర్తింపు

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో 12 మంది బడి ఈడు పిల్లలను విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ఓఎస్‌సీ సర్వేలో భాగంగా మండలంలోని పర్యటించిన మండల విద్యాశాఖ అధికారి వసంతకుమారి, సీఆర్‌పీ మల్లేశంలు రాయిలాపూర్ గ్రామ పరిధిలోని ఇటుక బట్టీల వద్ద 5 నుంచి 15 సంవత్సరాల వయసు గల 12 మంది చిన్నారులు విద్యనభ్యసించడం లేదని గుర్తించారు. వారిని స్థానిక పాఠశాలలో చేర్పి విద్యనందించనున్నట్లు వసంతకుమారి తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం 9వ వార్డులోని శాంతినగర్ కాలనీ వద్ద సుమారు రూ.10 లక్షల హెచ్ఎండీఏ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ కొమిరెల్లి అనితాసుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను విజయవంతం చేయాలి

సమీక్ష సమావేశంలో కలెక్టర్ హరీష్

సాక్షి,మేడ్చల్ జిల్లా: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా అధికారులంతా సమన్వయంతో విజయవంతం చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ హరీష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కంటి వెలుగు కార్యక్రమంపై జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య కలిసి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి క్యాంపులు నిర్వహించే చోట అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కంటి వెలుగు నిర్వహించే వివరాలను ముందుగానే ఆయా ప్రాంతాల ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి, డిప్యూటీ డీఎం అండ్ హెచ్వోలు డాక్టర్ ఆనంద్, డాక్టర్ నారాయణరావు, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రఘునాథస్వామి, డాక్టర్ సరస్వతి, జిల్లా మాస్ మీడియా అధికారి వేణుగోపాల్‌రెడ్డి, మంజుల, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘మన ఊరు మనబడి’ పనుల పరిశీలన



విద్యార్థులతో డీఈఓ విజయకుమారి

మేడ్చల్: గుండ్లపోచంపల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మన ఊరు–మనబడి పనులను జిల్లా విద్యాధికారి విజయకుమారి శనివారం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి చేపట్టిన పనులు వాటి పురోగతిపై చర్చించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించి వారి చదువులను అడిగి తెలుసుకున్నారు. సిలబస్ పూర్తయి రివిజన్ అంశంపై విద్యార్థులతో ఆమె మాట్లాడారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి పక్కా ప్రణాళికలతో చదవాలని సూచించారు. రంగోత్సవ్ కార్యక్రమంలో విద్యార్థులు మెరుగైన ప్రదర్శన చేసి పతకాలు సాధించడంతో ఆమె వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపినాథ్, ప్రేంకుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

మేడ్చల్: విద్యుత్ సంస్థలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న ఏళ్లుగా ఉన్న డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ హెచ్–82 సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిలు అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలని, ఆర్‌టీజెన్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, ఏపీఎస్ఈబీ రూల్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికుల పక్షాన తాము నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చౌకత్ పాషా, నాయకులు వెంకటేష్, జలీల్, బాల్‌రెడ్డి, జెన్‌కో–ట్రాన్స్‌కో, టీఎస్ ఎస్‌పీడీసీఎల్ నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాలు పట్టాల్సినోళ్లు తాపీ పట్టె!

ప్రహరీ నిర్మించుకున్న ఐటీఐ విద్యార్థులు



గోడలు నిర్మిస్తున్న విద్యార్థులు

మేడ్చల్: మున్సిపాలిటీలో ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా కూలిన ప్రహరీని అధికారులు నిర్మించకపోవడంతో ఐటీఐ విద్యార్థులే మరమ్మతులు చేసుకున్నారు. మేడ్చల్ ప్రభుత్వ ఐటీఐ ఒక వైపు జాతీయ రహదారి, మిగతా వైపులా వివిధ కాలనీలు ఉన్నాయి. కాలనీల నుంచి ఆకతాయిలు ఐటీఐ గ్రౌండ్‌లోకి చొరబడి వికృత చేష్టలు చేస్తూ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చారు. ప్రహరీ ఎత్తుగా ఉండటంతో అక్కడక్కడ గోడను కూల్చి గ్రౌండ్‌లోకి చొరబడుతూ విచ్చలవిడిగా తిరుగుతున్నారు. కూలిన ప్రహరీని నిర్మించి ఐటీఐకి రక్షణ కలిపించాలని మేడ్చల్ మున్సిపాలిటీలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు, సిబ్బంది నుంచి ఎలాంటి స్పందన రాలేదని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. దీంతో శనివారం విద్యార్థులు, ఐటీఐ సిబ్బంది కలిసి ఇటుకలు, సిమెంట్, మట్టిని తీసుకువచ్చి కూలీన గోడలను నిర్మించుకున్నారు. అదేవిధంగా అక్కడక్కడ ఉన్న పనికి రాని చెట్లను తొలగించారు. ఇలా గంటల తరబడి శ్రమించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు సైనికుడిలా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విక్రంరెడ్డి

ఘట్‌కేసర్: తెలంగాణలో సాగుతున్న బీఆర్ఎస్ అవనీతి, నియంత పాలనను తరిమేయడానికి ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ బాధ్యుడు నరేందర్ అన్నారు. శనివారం అవుషాపూర్ పీపీఆర్ కన్వెన్షన్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు చలువాది ప్రవీణ్‌రావు అధ్యక్షతన జరిగిన పోలింగ్ బూత్ స్థాయి కమిటీల నియోజకవర్గ సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మారెడ్డి, బాల్‌రాజ్‌ముదిరాజ్, ఎంపీటీసీలు శోభారాణి, వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ మహేశ్, శ్రీనివాస్ కరుణాకర్, ప్రతాపరెడ్డి, రామతీర్థ తదితరులు పాల్గొన్నారు.

‘సెయింట్ పీటర్స్’లో సంక్రాంతి వేడుకలు



వేడుకల్లో భాగంగా సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమంగ్–2023 పేరుతో చేపట్టిన వేడుకలను కళాశాల సెక్రెటరీ టీవీ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోగి మంటలు, రంగోలీలు వేసి, గాలిపటాలు ఎగురవేసి ఆనందంగా గడిపారు. సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.